ప్రజాశక్తి

శుక్రవారం 22 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





108 సమ్మె సైరన్

25వ తేదీ నుండి 108 సర్వీసు ఉద్యోగులు సమ్మెలోకి - నిలిచిపోనున్న అంబులెన్స్ సేవలు



డిమాండ్స్...

- 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలి
- 12 గంటల పనివిధానం రద్దు చేసి, 8 గంట పనివిధానం అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలివ్వాలి
- మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- గత టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన విధంగా వేతనంతో సంబంధం లేకుండా రూ.4 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి
- తెలంగాణలో మాదిరి ఉద్యోగ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి
- వాహనాలకు షెడ్స్ నిర్మించాలి, ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి.

ప్రజాశక్తి-గుంటూరు

రాత్రనకా, పగలనకా ప్రజలకు ఏ అత్యవసరం వచ్చినా కుయ్ కుయ్‌మనే హారన్ మోగిస్తూ రయ్ రయ్ మంటూ వచ్చి క్షతగాత్రులను, రోగులను ఆసుపత్రులకు చేరుస్తున్న 108 సిబ్బంది విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవిడ్ వంటి విపత్తు సమయంలోనూ ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా మేమున్నామని ముందు నిలిచిన వారి సంక్షేమాన్ని అటు ప్రభుత్వాలుగానీ, ఏజెన్సీ నిర్వహణ యాజమాన్యాలుగానీ పట్టించుకోవట్లేదు. ఏళ్ల తరబడి సమస్యలతో సతమతం అవుతున్న 108 అంబులెన్స్ సర్వీసు ఉద్యోగులు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవటంతో ఈనెల 25వ తేదీ నుండి సమ్మెకు పిలుపునిచ్చారు.



సమస్యల పరిష్కారానికి గత నెల అక్టోబర్ 26 నుండి వినతులు, నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసనలు, కలెక్టరేట్ల వద్ద రిలే దీక్షలు వంటి రూపాల్లో ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. 108 వాహనాల నిర్వహన ఏజెన్సీ అరబిందో కంపెనీ గత నాలుగేళ్లకుపైగా ప్రభుత్వం నుండి పూర్తి స్థాయిలో నిధులు పొందుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించింది. దీంతో ఉద్యోగులు ఈనెల 11న సమ్మె నోటీసు ఇచ్చారు. 25న విజయవాడలో రాష్ట్ర వ్యాప్త రిలే దీక్షలు నిర్వహించి అప్పటికీ స్పందించకపోతే అదేరోజు అర్థరాత్రి నుండి అంబులెన్స్‌లను ఎక్కడికక్కడ నిలిపివేసి సమ్మెలోకి వెళతామని ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) స్పష్టం చేసింది.

గుంటూరులో జిల్లాలో 23 వాహనాలున్నాయి. వాటిలో 98 ▶ 2లో

పరిష్కరించకుంటే సమ్మె తప్పదు



ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు. సమ్మెకు యాజమాన్యం, ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకకపోవటంతో అనివారస్యంగా సమ్మెకు వెళుతున్నాము. యాజమాన్యం నష్టాల సాకుతో ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవట్లేదు. కనీస వసతులు కూడా కల్పించట్లేదు. పనిభారం పెరిగిపోయింది. ప్రభుత్వం నుండి వందకు వంద శాతం వాహనాల నిర్వహణ ఖర్చులు తీసుకుంటూ కూడా ఉద్యోగుల గురించి పట్టించుకోకపవటం దారుణం. తక్షణమే ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇప్పించాలి. ప్రభుత్వమే ఈ వ్యవస్థను బలోపేతం చేసి, నిర్వహించాలి.

ఎ.రామకృష్ణ, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు .

పత్తి రైతులకు నష్టం చేస్తున్న నిబంధనలు

- మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల వల్ల బయ్యర్లు, మిల్లర్లు కుమ్మక్కు
- 90 శాతం మంది రైతులు అప్పుల్లోనే
- సమస్యలపై 26న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా : కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - సత్తెనపల్లి



మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిఎం.హరిబాబు

పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసి క్వింటాళ్‌కు రూ.7521 మద్దతు ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లికి గురువారం వచ్చిన ఆయన స్థానిక పుతుంబాక భవన్‌లో విలేర్లతో మాట్లాడారు. ఈ ఏడాది పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయారని, కొనుగోలు కేంద్రాల ప్రారంభంలోనూ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని అన్నారు. దీనికి తోడు నిబంధనలు పేరుతో 12 శాతానికి మించి తేమ ఉన్న పత్తిని కొనకుండా తిరస్కరిస్తున్నారని, ఇది కూడా రైతులకు నష్టం చేస్తోందని అన్నారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రైవేటు మిల్లుల్లో ఏర్పాటు చేయడం వల్ల రైతులకు రవాణా ఖర్చులు పెరుగుతున్నాని, బయ్యర్లు, మిల్లర్లు కుమ్మక్కవుతున్నారని విమర్శించారు. నిబంధనల పేరుతో పత్తిని కొనకుండా తిరస్కరించడం వల్ల ▶ 2లో



బిజెపి విధానాలకు వ్యతిరేకంగా బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బోసు సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ నెహ్రా బొమ్మ సెంటర్, తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం, సాయిబాబా గుడి, తహశీల్దార్ కార్యాలయం, నులకపేట, ప్రకాష్ నగర్, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట శిబిరం వరకు సాగింది. ఈ సందర్భంగా వివిధ సెంటర్లలో జరిగిన గ్రూప్ మీటింగ్లో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి ▶ 2లో

మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని అరండల్‌పేట నుండి కొత్తపేట వైపు వెళ్లే ప్రధాన మార్గమైన 3 వంతెనల వద్ద రైల్వేశాఖ నూతన ట్రాక్ విస్తరణ పనులు చేపడుతోంది. ఈ నేపథ్యంలో నవంబర్ 25 నుండి 60 రోజులపాటు వాహనాల రాక పోకలు నిలిపివేస్తున్నట్లు నగర కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. జిఎంసి కౌన్సిల్ హాల్లో రైల్వే, ట్రాఫిక్, ఆర్ అండ్ బి, జిఎంసి అధికారులతో 3 వంతెనల వద్ద రాకపోకల నిలిపివేత, ప్రత్యామ్నాయ చర్యలపై గురువారం సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ నూతన ట్రాక్ విస్తరణ పనుల నేపథ్యంలో రాకపోకలు నిలిపివేయాలని రైల్వే అధికారులు కోరారన్నారు. కావున నగర ప్రజలు గమనించి, నెహ్రూనగర్ గేటు, శంకర్ విలాస్ వంతెనవైపు నుండి కొత్తపేటకు వెళ్లాలని సూచించారు. ఆర్అండ్‌బి అధికారులు శంకర్‌విలాస్ వంతెనపై రోడ్ ప్యాచ్‌వర్క్‌లను చేపట్టాలని, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిఎంసి ఎస్ఇ నాగమల్లేశ్వరరావు, సిటీప్లానర్ రాంబాబు, ఆర్ అండ్ బి డిఈఈ చిన్నయ్య, పశ్చిమ ట్రాఫిక్ సిఐ సింగయ్య, రైల్వే ఎడిఎన్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థినిపై అత్యాచార నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖపట్టణంలో న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఘటనను నిరసిస్తూ, నిందితుల్ని కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్లో ప్రదర్శన చేశాయి. ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పద్మ మాట్లాడుతూ విశాఖలో లా ▶ 2లో



కరెంటు లేక ఎండుతున్న పైరు

ప్రజాశక్తి - రెంటచింతల



విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయంతో అదును మీదున్న మిర్చిపైరు ఎండు ముఖం పడుతోంది. కాల్వ ద్వారా నీరందని చివరి భూముల్లో బోర్ల ఆధారంగా రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తామన్న అధికారుల ప్రకటన అమలు కాకపోవడంతో పూత దశలో ఉన్న పైరు ఎండిపోవడానికి సిద్ధమవుతోంది. త్రీఫేస్ కరెంటు ఇవ్వకపోవడం వల్ల తమ కళ్లముందే పైర్లు ఎండిపోతున్నాయని, ఇప్పటికే ఎకరాకు రూ.80 వేల వరకూ ఖర్చు చేశామని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రదినిధులు స్పందించి త్రి ఫేస్ విద్యుత్‌ను రోజూ 9 గంటలపాటు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

గుంటూరు సిజిఎస్‌టికి ఫస్ట్ గ్రేడ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

దేశంలోని 48 సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్‌లలో గుంటూరు సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్‌కు యాన్యువల్ కంపోజిట్ గ్రేడింగ్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రథమ స్థానం దక్కింది. ఈ మేరకు ఢిల్లీలోని సిజిఎస్‌టి ఆడిట్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం గ్రేడింగ్ లిస్ట్‌ను గురువారం విడుదల చేసింది. 100 మార్కుల్లో గుంటూరు కమిషనరేట్ అత్యధికంగా 73.22 మార్కులు సాధించగా, అత్యల్పంగా కొలకోటలోని దుర్గాపూర్ ఆడిట్ కమిషనరేట్‌కు 49.43 మార్కులు వచ్చాయి. గుంటూరు ఆడిట్‌లో పనిచేసిన అధికారులకు ఆ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, కమిషనర్ పి.ఆనంద్ కుమార్ అభినందనలు తెలిపారు.



కూటమి హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య కోరారు. గురువారం సాయంత్రం తాడేపల్లి సలాం సెంటర్ రన్నింగ్ రూమ్ ప్రాంతాల్లో నివాసముంటున్న పేదల వద్ద నుండి ఇళ్ల స్థలాల అర్జీలను కంచర్ల కాశయ్య, సిపిఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య స్వీకరించారు. కాశయ్య మాట్లాడుతూ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలివ్వాలని కోరారు. తద్వారా ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ కార్మిక వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టి.వెంకటయ్య, మహిళలు పాల్గొన్నారు.



పెంకుటిల్లు దగ్ధం - రూ.20 లక్షల నష్టం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

షాట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో బుధవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన షేక్.ఖాన్ సాహెబ్, షేక్ చిన్న బాబు,షేక్ మహబూబ్ సుభాని అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే వీరు ఒకే ఇంట్లోని వేర్వేరు పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. రోజు వారి లాగే పొలం పనులు చేసుకొని వచ్చి ఇంట్లో పని చేసుకొని పడుకునే సమయంలో షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడటంతో అందరూ భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వారొచ్చేలోపే మంటలు ఇల్లంతా వ్యాపించి సర్వం బూడిదయ్యాయి. బాధితులు కట్టు వస్త్రాలతో మిగిలారు. మంటల వల్ల గ్యాస్ సిలిండర్లు పేలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మరోవైపు ఇన్నేళ్ల తమ కష్టార్జితమంగా మంటల్లో బూడిదైందని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సుమారు రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ఘటనా స్థలిని గ్రామ రెవెన్యూ అధికారి గురువారం పరిశీలించి బాధితులకు నిత్యావసర సరుకులు అందచేశారు.



విద్యార్థులకు బహుమతుల అందజేస్తున్న శివరామకృష్ణయ్య

వారోత్సవాల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయం నందు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పెదనందిపాడు రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎన్.శివప్రసాద్ సహకారంతో బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయ నిర్వాహకురాలు పగడాల సుభాషిణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి పెదనందిపాడు అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి గ్రంథాలయ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. నేటి యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి శేషగిరిరావు, అర్వపల్లి కృష్ణమూర్తి, పోపూరి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, బోరుగడ్డ శాంసన్, కొర్రపాటి సువార్త, సుహాసిని, మంజుల పాల్గొన్నారు.

పలువురికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, టిడిపి తుళ్లూరు మండల అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు

ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.24 లక్షల 74 వేల 891 చెక్కులను బాధితులకు స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ గురువారం అందజేశారు. గుంటూరులోని టిడిపి తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఈ చెక్కులు అందించారు. బత్తుల రాజ్యలక్ష్మి (ఉద్దండరాయుని పాలెం) రూ.1,95,999, మెండెం రాజ్యలక్ష్మి (బోరుపాలెం) రూ.23,400, బొద్దులూరి చిట్టిబాబు (నేలపాడు) రూ.60 వేలు, అత్తిపట్ల పూర్ణచంద్రరావు (లేటు) (పెదపరిమి) రూ.50,100, తుమ్మల రజినికృష్ణ (పేరేచర్ల) రూ.1,22,400, షేక్ ముజావర్ గాఫర్ (తురకపాలెం) రూ.65 వేలు, సయ్యద్ అల్లాబక్షు (మేడికొండూరు) రూ.60 వేలు, ఉప్పులూరి కోటేశ్వరమ్మ (సిరిపురం) రూ.43,651, ఈవూరి రామిరెడ్డి (వరగాని) రూ.1,62 వేలు, ఏపూరి మాధవి (యర్రగుంట్లపాడు) రూ.80,635, తెనాలి సౌరీలు (ఫిరంగిపురం) రూ.52,378, సంగెపు నీరజ (తక్కెళ్ళపాడు) రూ.1,04117, ఇమదాబత్తుని శివరామకృష్ణ (నుదురుపాడు) రూ.1,17,708, షేక్ ఫాతిమా (వేమూలూరిపాడు) రూ.3,99,303, డేగల వెంకట శివయ్య (ఎల్‌ఓసి) (113 తాళ్లూరు) రూ.1,64,414, చింకా రామారావు (నిడుముక్కల) రూ.2,16,659, ఎనుగునూరి వెంకట కృష్ణారెడ్డి (కంతేరు) రూ.1,86,500, వట్టికూటి శివనరసింహారావు (దామరపల్లి) (ఎల్ఒసి) రూ.1,08,600, కామేపల్లి ధనుష్ కోటి (పొన్నెకల్లు)కు రూ.45,000ల చొప్పున చెక్కులు అందజేశారు.

మద్యం తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మద్యం తాగి యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కొచ్చర్ల విజయరాజు (37) అధికంగా మద్యం తాగిన కారణంగా మరణించగా మృతుని తాత చింత వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధు పవన్ తెలిపారు.మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పిల్లలిద్దరూ బోయపాలెం గురుకుల పాఠశాలలో చదువుతున్నారు.

108 సమ్మె సైరన్

(మొదటి పేజీ తరువాయి)

మంది సిబ్బంది పని చేస్తున్నారు. జీతాలు సరిగా రాక, ఇటీవల ఐదుగురు మానేశారు. పల్నాడు జిల్లాలో పల్నాడు 33 వాహనాలు ఉంటే 95 మందే ఉన్నారు. సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ బాధ్యతలు తీసుకున్న అరబిందో కంపెనీ నాలుగున్నరేళ్లుగా ప్రతినెలా క్రమం తప్పకుండా జీతాలు కూడా చెల్లించలేదని, రెండు మూడు నెలల వరకూ బకాయిలు ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సి ప్రావిడెంట్ ఫండ్‌కు యాజమాన్య వాటాను కూడా ఉద్యోగుల జీతాల నుండే కట్ చేస్తున్నారు. దీంతో రూ.20 వేల వేతనం పొందుతున్న వారు కటింగ్స్ పోనూ రూ.16 వేలు వస్తున్నాయి.

గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని నమ్మించి ఎక్స్‌పీరియన్స్ ఆధారంగా శ్లాబ్ విధానం తెచ్చింది. అందరూ ఒకే విధమైన పనిచేస్తున్నా పదేళ్ల సర్వీసు ఉంటే రూ.30 వేలు, ఐదేళ్ల సర్వీసు ఉంటే రూ.25 వేలు, మిగిలిన వారికి రూ.20 వేలు జీతం చెల్లిస్తున్నారు. సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవటంతో రోజుకు 12 గంటల చొప్పున రెండు షిఫ్టులుగా పనిచేస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారు. 8 గంటల పనివిధానం అమలు చేయమని ఉద్యోగులు కోరుతున్నారు. మరణించిన వారికి మట్టి ఖర్చులు కూడా ఇవ్వట్లేదు. కరోనా కాలంలో కష్టపడి పనిచేసిందుకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో వెయిటేజీ ఇస్తామని చెప్పింది. కానీ 108 సర్వీసు వారికి మాత్రం ఇవ్వలేదు. తెలంగాణాలో పారామెడికల్ సిబ్బంది అందరికీ వెయిటేజీ ఇచ్చారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం జీతంతో సంబంధం లేకుండా ప్రతినెలా రూ.4 వేలు గౌరవ వేతనం ఇచ్చింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక దానిని రద్దు చేసింది. 108 వాహనాలకు షెడ్లు లేవు. డ్రైవర్లు చెట్టుకిందే ఉంటున్నారు. భోజనం చేయటానికి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవటానికి కూడా సరైన సదుపాయం లేదు. రాత్రిపూట వాహనాల్లోనే ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు సరైన సదుపాయాలు లేవు.

పత్తి రైతులకు నష్టం చేస్తున్న నిబంధనలు

(మొదటి పేజీ తరువాయి)

దాన్ని ప్రైవేటు మిల్లర్లకు అతి తక్కువ ధరకు రైతులు తెగ నమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని తెలిపారు. బయ్యర్లు, మిల్లలకు లాభం చేసేలా సిసిఐ నిబంధనలు ఉన్నాయన్నారు. నిబంధనలను సడలించి రైతుల వద్ద పంట మొత్తాన్ని కొనాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో పత్తి రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, వరికి నిర్ణయించిన మద్దతు ధర రూ.2304 సరిపోదని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల, ధరలు దక్కక రైతులు నష్టపోతున్నారని, 90 శాతం మంది రతులు అప్పుల్లోనే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో రైతులకు రణమాఫీ కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు. ఈ సమస్యలతోపాటు కార్మికుల సమస్యలు, వారి హక్కుల కోసమూ దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ ఉంటుందని, రైతులు, కౌలురైతులు, కూలీలు, వివిధ రంగాల్లో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, సత్తెనపల్లి మండల కార్యదర్శి పి.మహేష్ పాల్గొన్నారు.

బిజెపి విధానాలకు వ్యతిరేకంగా బైక్‌ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

రైతులు అన్యాయం చేసిందని విమర్శించారు. ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఊవ్వెత్తున సాగిన ఉద్యమంతో పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి హామీలు ఇవ్వడంతో అప్పటి పోరాటాన్ని విరమించినట్లు చెప్పారు. అయితే హామీలను కేంద్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోసుకోలేదని దుయ్యబట్టారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మార్పులు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చారని, అంబానీచ ఆదానీల సేవలో కేంద్రం ప్రభుత్వం మునిగి తేలుతోందని విమర్శించారు. ప్రజా సంపదనంతా కొల్లగొట్టి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న గుంటూరులో జరిగే భారీ ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని రైతులు, కూలీలు, కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు, కార్మిక సంఘాల నాయకులు వి.దుర్గారావు, డి.వెంకట్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు, ఆదినారాయణ, కె.కరుణాకర్‌రావు, కె.స్టీవెన్, వై.బర్నబాస్, బి.రామారావు, కె.బాబురావు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థినిపై అత్యాచార నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థినిని ప్రేమపేరుతో నమ్మించి, సామూహిక అత్యాచారం చేయడం సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన విషయమన్నారు. దీనిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వరమే విచారణ పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. మహిళలు, చిన్నారులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై దాడులకు కారణమవుతున్న మద్యాన్ని నియంత్రించాలని కోరారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం మరువకముందే ఇలాంటి సంఘటన జరగటం చాలా బాధాకరమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోయాయని, బిజెపి, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మహిళల పట్ల చిన్నచూపే వారిపై దాడులకు కారణమవుతోందని విమర్శించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వస్తున్న నేపథ్యంలో ఇటువంటి ఘటనలు దేశాభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయవన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు అరికట్టాలని, పోర్న్ వెబ్‌సైట్లు, అశ్లీల సాహిత్యాన్ని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అనురాధ, సిఐటియు నాయకులు షేక్ ఖాసిం షహీద్, ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్.సమీర్, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, ఎం.రమాదేవి, పద్మ, అచ్యుతకుమారి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు దోహదం

డిఆర్ఎం కప్ క్రీడల ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం జరిగిన 2వ డీఆర్ఎం కప్-2024 పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, అనుబంధ శాఖల ఉద్యోగులు క్రీడలు ఆడటం వల్ల రోజువారీ పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. రైల్వే అధికారులు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డిఆర్ఎం కప్ క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించాలని సూచించారు. డిఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీలు రైల్వేలోని శాఖల మధ్య సమన్వయం పెంపొందించటమే కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, స్నేహభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ పోటీల్లో డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, తెలంగాణాలోని యాదాద్రి భువనగిరి, నల్గొండ మొత్తం ఏడు జిల్లాల పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభ అనంతరం కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్ఎం, రీజినల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శివహర్ష బాస్కెట్ బాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎడిఆర్ఎం సైమన్, మనోహర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ దినేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



బాస్కెట్ బాల్ అడి క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్, డిఆర్ఎం ఇతర ఉన్నతాధికారులు

వ్యాసరచనలో 'చలమయ్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య డిగ్రీ కాలేజి విద్యార్థులు సత్యసాయి విద్యాసంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ యం.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా స్థాయిలో వి.పూజిత ఇంగ్లీషు విభాగంలో మొదటి బహుమతి, యం.యోగేశ్వరలక్ష్మి తెలుగు విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, సమితి స్థాయిలో తెలుగు విభాగంలో జి.ఈశ్వరమ్మ ద్వితీయ బహుమతి, ఇంగ్లీషు విభాగంలో షేక్.హసీనాకౌసర్ ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. ఇంటర్ స్థాయిలో కె.శిరీష, వి.హారిక, పి.ప్రసన్న, సయ్యద్ జాస్మిన్ బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా గురువారం బాపూజీ కమిటీ ఉపాధ్యక్షులు కర్పూరపు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి వై.చంద్రశేఖర్, కల్చరల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు, ఇంటర్ కాలేజ్ ఇన్‌చార్జి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్ని అభినందిస్తున్న సూర్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు

గురవయ్య కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తమ విద్యార్థులు కేంద్రగ్రంథాలయ శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఇంటర్ విద్యార్థి ఎన్.మోహనకష్ణ ప్రథమ బహుమతి, వక్తత్వ పోటీలో తతీయ బహుమతి సాధించాడని మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ పెద్ది విజయలక్ష్మి తెలియజేశారు. అలాగే షేక్ సాదిక్, వరుణ్‌సాయి, ప్రభాకర్ క్విజ్ పోటీల్లో ద్వితీయ, తతీయ, కన్సోలేషన్ బహుమతులు సాధించారన్నారు. శ్రీకష్ణదివ్యజ్ఞాన సమాజం వారు నిర్వహించిన వక్తత్వ పోటీల్లో కూడా మోహనకష్ణ తతీయ బహుమతి గెలుపొందాడన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు కార్యదర్శి, కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు అభినందనలు తెలియజేశారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మంత్రి భరత్‌కు అవోపా సత్కారం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్‌ను అవోపా తరపున గుంటూ రులో సన్మానించారు. స్థానిక అమరావతి రోడ్డులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో గురువారం అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు అధ్యక్షతన అవోపా ప్రతినిధులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కోరారు. అవోపా చేస్తున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, జివిఎస్ కాంతారావు, కె.వి.బ్రహ్మం, ఆర్.సుబ్బారావు, యం.రామకృష్ణయ్య, కె.ఏకానంద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తు అవోపా ప్రతినిధులు

బిసి కులాల సమన్వయ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలంటే కులాల వారి జనాభా లెక్కలు తేల్చాలని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఉదాసీనంగా ఉన్నాయని బిసి కులాల సమన్వయ కమిటీ జిల్లా ఛైర్మన్ తోట కోటేశ్వరరావు అన్నారు. కులగణన సాధనకు స్థానిక అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో బిసి కులాలు సమావేశమై జిల్లా బిసి కులాల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా తోట కోటేశ్వరరావు మాట్లాడుతూ బీహార్‌లో కులగణన చేసి బిసిల రిజర్వేషన్లు 65శాతం పెంచారని, చాలా రాష్ట్రాలు కులగణనకు ముందుకు వస్తున్నాయన్నారు. తెలంగాణ కూడా సమగ్ర కులగణన మొదలైందని, కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులజనగణన ఊసేలేదన్నారు. ఈ క్రమంలో బిసి ప్రజా సంఘాలు ఏకమై జనగణనలో సమగ్ర కులగణనకు కృషి చేయాలన్నారు. అనంతరం బిసి కులాల సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా బీపీ మండల్ స్టడీసర్కిల్ ఫౌండర్ తోట కోటేశ్వరరావు, కన్వీనర్‌గా విద్యావేత్త దాసరి తిరుపతి, అధికార ప్రతినిధిగా నిరుద్యోగ ఐక్య వేదిక కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రమణ్యం, ట్రెజరర్‌గా కె.దేవప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిసి సమన్వయ కమిటీ రాష్ట్ర ఛైర్మన్ అంగడాల పూర్ణ చంద్రరరావు, కన్వీనర్ బిసి రమణ, బొక్క పరంజ్యోతి, డాక్టర్ అలా వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో ఇద్దరు బాలికలు గల్లంతు

వనికుంటలో ప్రమాదవశాత్తు ఘటన

ప్రజాశక్తి - ఈపూరు

తండ్రి తన ఇద్దరు బిడ్డలతో ద్విచక్ర వాహనం పై వెళు తుండగా ప్రమాదవశాత్తు అద్దంకి కెనాల్ బ్రాంచ్ కాల్వలో పడిపోయాడు. స్థానికులు తండ్రిని రక్షించగా, బిడ్డలు గల్లంతయ్యారు. ఈ సంఘటన ఈపూరు మండలం వనికుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరు మండలం వనికుంటకు చెందిన సాక్షి దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న తురుమెళ్ల వెంకట నాగాంజనేయ శర్మ తన ఇద్దరు కుమార్తెలు యామిని (10), కావ్య (5)లను తీసుకుని నరసరావుపేట వైద్యశాలకు వెళుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ముప్పాళ్ల వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో పడిపోయాడు. ఇద్దరు చిన్నారులు గల్లంతు కాగా శర్మ కాల్వ గట్టుపై ఉన్న గడ్డిని పట్టుకొని కేకలు వేయడంతో పక్కనే ఉన్న ధనలక్ష్మి పవర్ ప్లాంట్ సిబ్బంది, ముప్పాళ్ళ గ్రామస్తులు గమనించి కొబ్బరి మట్ట సాయంతో శర్మను పైకి లాగటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సంఘటన సమాచారంతో వినుకొండ పట్టణ సీఐ యు శోభన్ బాబు, తహసిల్దార్ ఎ నళిని, ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు కాలువ వద్దకు చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. గాలింపు చర్యలకు నీటి ఉధతి ఎక్కువగా ఉండటంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా కాలువ నీటి ఉధతిని తగ్గించి గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చేపట్టి ద్విచక్ర వాహనాన్ని బయటకు తీశారు. ఇద్దరు చిన్నా రుల ఆచూకీ లభించలేదు. ఎన్ డిఆర్ఎఫ్ బృందాలు కాలువ వద్దకు చేరుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం ఉమా మహేశ్వరావు తెలిపారు.



గల్లంతైన యామిని, కావ్య



మేడికొండూరు షాపుల్లో తనిఖీ చేస్తున్న ఏడిఏ కే రామకోటేశ్వరి

పురుగు మందుల షాపులో తనిఖీ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని మేడికొండూరు, పేరేచర్ల గ్రామాలలో ఉన్నా పలు పురుగుమందుల దుకాణాలను అంతర్ జిల్లాల తనిఖీ అధికారి, పొన్నూరు సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు కే రామకోటేశ్వరి గురువారం తనిఖీ చేశారు. ప్రధానంగా షాపులలో ఉన్న స్టాకు రిపోర్టులను పరిశీలించారు. ప్రభుత్వం నుండి విక్రయ అనుమతులు కలిగినవి ఎన్ని రకాలు అనేది పరిశీలించారు. ఎరువుల మందులకు సంబంధించి సక్రమంగా ఉన్నాయా లేదా అనే వ్యత్యాసాలను గుర్తించారు. అదేవిధంగా వివిధ కంపెనీలకు చెందిన మందులు వాస్తవ ధరలు, రైతులకు విక్రయించే ధరలు వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పురుగు మందులు, బలం మందులు నిన్ను ఎంత రేట్లకు మించి అధిక ధరలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీ అధికారి కోటేశ్వరి హెచ్చరించారు. ఇతనికిలలో మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వహించే వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎక్సైజ్ సిఐ డి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. వెంకటరామిరెడ్డి అనే బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని అతని వద్దనుండి ఓల్డ్ అడ్మిరల్ ఫైన్ విస్కీ 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ డి వెంకటేశ్వర్లు తెలిపారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

యుటిఎఫ్ మండల శాఖ సమావేశం పట్టణంలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పొన్నం వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా సయ్యద్ తాజుద్దీన్, సహాధ్యక్షులుగా పాలెపోగు రమేష్‌బాబు, మహిళా సహాధ్యక్షులుగా తమనం శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నంబుల విష్ణుమూర్తి, కోశాధికారిగా బివి శేషిరెడ్డి, కార్యదర్శులుగా ఎస్‌కె.సాయిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఎన్.వి భాస్కర్, డి.రాంప్రసాద్, ఎస్‌కె.బాజీ, ఎం.జానకి, ఎస్‌కె.జాఫర్ అలీ, కె.నాగరాజు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బొర్రా వెంకట్రావు, జె.మాధురి దాసరి తోమాసయ్య, ఎం.భద్రయ్య, పుప్పాల వెంకటేశ్వర్లు, ఎస్ డి సలీం, ఎం.నిర్మల, ఎ.శ్రీనివాసరెడ్డి, టి.శేషగిరిరావు ఎన్నికయ్యారు.



మస్తాన్ షరీఫ్‌ను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ మస్తాన్ షరీఫ్‌కు టిడిపి నాయకుల సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విశాఖపట్నం ఆంధ్ర విశ్వ విద్యాలయంలో 'ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ ఇట్స్ ఇన్ఫ్లూయెన్స్ ఆన్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఎమాంగ్ టీచర్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ ఇనిస్ట్యూషన్స్' అంశంపై పరిశోధనకు గాను ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్‌ఖు యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ అండ్ గైడ్ ప్రొఫెసర్ జాలాది రవి ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం టిడిపి నాయకులు షేక్ సైదా, పచ్చవ నరేంద్ర, షేక్.షరీఫ్, బుజ్జి, యూసుఫ్ తదితరులు డాక్టర్ మస్తాన్ షరీఫ్‌ను అభినందించారు. పల్నాడు ప్రాంతంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటు ఫీజులతో నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను చేరువ చేయడం పట్ల చైర్మన్ మీరావలికి, కళాశాల సెక్రటరీ- కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్‌కు టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.6 లక్షలతో సిసి కెమెరాలు వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

నేరాల నిరోధానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు అన్నారు. పెదకూరపాడు పోలీస్‌స్టేషన్లో దాత అత్తోట మురళి ముకుంద్ రూ.6 లక్షలతో సమకూర్చిన 23 సీసీ కెమెరాలను డీఎస్పీ గురువారం ప్రారంభించారు. పెదకూరపాడు ఆసుపత్రికి అవసరమైన సెలైన్ స్టాండ్స్, నేబులైజర్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. మురళి ముకుంద్ మాట్లాడుతూ పెదకూరపాడు గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రమేష్, జిడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వివిఎస్ వరప్రసాద్, సర్పంచ్ జి.రాజు, బి.గోపాలరావు, కె.అప్పారావు, సిఐ సురేష్ పాల్గొన్నారు.



26న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-ముప్పాళ్ల

రైతు సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 26వ తేదీన నర్సారావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కౌలురైతు సంఘం మండల నాయకులు టి.అమరలింగేశ్వరరావు, నాయకులు నరసింహారావు కోరారు. ఈ మేరకు మండలంలోని చాగంటివారిపాలెంలో గురువారం కరపత్రాలతో ప్రచారం చేశారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, మరోవైపు నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలుచేయ బూనుకున్నారని విమర్శించారు. పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, వ్యవసాయ బోర్లకు మోటార్లు పెట్టే ప్రక్రియ అపాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలనే పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20 వేలను రైతుల, కౌలురైతుల ఖాతాల్లో కూటమి ప్రభుత్వం సత్వరం చేమ చేయాలన్నారు. పత్తి పంటను ప్రైవేటు మిల్లుల్లో కాకుండా మార్కెట్ యార్డుల్లో సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసి చౌక దుకాణాల అందించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి- రెంటచింతల


పంటకు మద్దతు ధరలు కల్పించడంలో విఫలమై పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర,



రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం ఏఐఎఫ్టీయూ (న్యూ) ఆధ్వర్యంలో గురువారం రెంటచింతలలో నిరసన తెలిపారు. రైతులను రుణ భారం నుంచి తప్పించాలని, మూసేసిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక సమస్యలపై 26న ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సత్తయ్య, ఎలమంద, యేసు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు వెంకటనారాయణ మృతి

ప్రజాశక్తి-యడ్లపాడు



సిపిఎం సీనియర్ నాయకులు జాగర్లమూడి వెంకట నారాయణ (91) యడ్లపాడు మండలం ఉన్నవలోని తన నివాసంలో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. నారాయణకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె కాగా భార్య 30 ఏళ్ల క్రితం చనిపోయారు. వ్యవసాయ కార్మిక సంఘంలో కీలకంగా పని చేసిన నారాయణ కూలీల సమస్యలపై జరిగిన పలు ఉద్యమాల్లో భాగస్వాములు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభకు వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య అధ్యక్షత వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పుట్టుక, చావు మన చేతుల్లో ఉండవని, బతికినన్నాళ్లు ఎలా బతకాము అన్నదే ముఖ్యమని చెప్పారు. సిద్ధాంతానికి కట్టుబడి పని చేయడం, సమయపాలన నారాయణలో ప్రముఖంగా కనిపించే లక్షణాలన్నారు. సీనియర్ నాయకులు పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాశక్తి బాధ్యతలను సైతం నారాయణ చూశారని, ప్రతిరోజూ పత్రికను చదవడంతోపాటు రైతువాణి, కార్మికలోకం పత్రికలకు కూడా సభ్యులను చేర్చారని చెప్పారు. సభలు, సమావేశాలకు ఎన్ని అవరోధాలు ఎదురైనా సమయానికి హాజరయ్యేవారని గుర్తు చేశారు. నర్సాపురంలో ఉండగా కొల్లా వెంకయ్యతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని చెప్పారు. గ్రామం సీనియర్ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నవ గ్రామంలో కౌలురైతుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో నాయకులు ఎన్.కాళిదాసు, సుబ్బారావు ఎన్.నాగేశ్వరరావు, తులశయ్య, పి.వెంకటేశ్వర్లు, ఎస్.బాబు, టి.ప్రతాపరెడ్డి స్థానికులు పాల్గొని నివాళు లర్పించారు.

బ్లాక్‌మెయిలర్ ఫిర్యాదుతో అక్రమ కేసులు

టిడిపితో అంటకాగిన పోలీసులపై భవిష్యత్‌లో చర్యలు : మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మతిస్థిమితం లేని బ్లాక్‌మెయిలర్ చేసిన ఫిర్యాదుతో తనపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంబంధం లేని విషయంలో, సాక్ష్యాలు లేకున్నా టిడిపి ఆదేశాలతో కేసు పెట్టారని అన్నారు. నరసరావుపేట పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన కొల్లా సాంబశివరావు ఎవరో తెలియదని, అతని ముఖం కూడా తాను చూడలేదని చెప్పారు. ఈ వ్యక్తి 2019లో అరవపల్లి – కాకాని మధ్యలో కామరాజు అనిల్ కుమార్ అనే వ్యక్తి వద్ద 6.10 సెంట్ల మట్టి తవ్వి తీసిన గుంటల భూమిని మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు రూ.5 లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేయించుకున్నాడని, పొలంలో గుంటలు పూడ్చుకునే క్రమంలో పమిడిపాడుకు చెందిన శ్రీకాంత్, సీతారామయ్యల ద్వారా రూ.20 లక్షల మట్టి తోలించి డబ్బులు చెల్లించలేదని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి డబ్బులు లేక ముందస్తు ఒప్పందం మేరకు సాంబశివరావు నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన రవికిషోర్ రెడ్డి ద్వారా అనీల్‌కు డబ్బులు చెల్లించి రవి కిషోర్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించారని, దీనికి సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో సాక్షులుగా కొల్లా సాంబశివరావు సంతకం పెట్టారన్నారు. ఏ విధమైన హక్కు లేని సాంబశివరావు ఇప్పుడు అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ ఫిర్యాదులు చేస్తుండగా పోలీసులు కూడా విచారణేమీ లేకుండా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపడితే తాను పూర్తిగా సహకరిస్తానన్నారు. పోలీసులకు వాస్తవాలు తెలిసినా టిడిపి నేతల ఒత్తిడి మేరకే ఈ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సాంబశివరావు వ్యవహారశైలి, తప్పుడు ఆరోపణలపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంతో అంటకాగి అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై భవిష్యత్‌లో తప్పనిసరిగా చర్యలు ఉంటాయన్నారు. అక్రమ కేసులపై చట్టపరంగా పోరాడుతామని చెప్పారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభిమాని రాజారత్నం మృతి

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని లేమల్లెకు చెందిన సిపిఎం అభిమాని బి.రాజరత్నం (57) గురువారం ఉదయమ మృతిచెందారు. భౌతికకాయాన్ని సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, రూరల్ మండల కార్యదర్శి బి.సూరిబాబు నాయకులు ఎస్‌డి మొహిద్దీన్‌వలి, వెంకటేశ్వరరాజు, సిహెచ్.భాస్కరరావు, భద్రయ్య, వై.కృష్ణ ఎషియా తదితరులు సందర్శించి నివాళులర్పించారు. పదేళ్లుగా సిపిఎం కార్యాలయంలోనే అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో పలువురు పాల్గొని జోహర్లు అర్పించారు.

26 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని పల్లు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ గురువారం తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో పెదగార్లపాడు, 28న తక్కెళ్లపాడు, 29న కేసానుపల్లిలో క్యాంప్‌లు ఉంటాయన్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తవి కావాల్సిన వారు ఈ క్యాంపులను ఉపయోగించుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

ప్రజాశక్తి- మాచర్ల : స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డిపోమేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ బత్తుల వీరయ్య గురువారం తెలిపారు. మాచర్ల, పరిసర గ్రామ ప్రజలు, ప్రయాణికులు వారి గ్రామాలకు సంబంధించిన బస్సుల విషయములో సమస్యలు, సూచనలు, సలహాలు తెలపాలని కోరారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225432 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ కవిగా దర్శి శేషారావు

ప్రజాశక్తి - పెదకూరపాడు : బాలల దినోత్సవ సందర్భంగా శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో పెదకూరపాడుకు చెందిన ప్రజాకవి దర్శి శేషారావు ఉత్తమ కవిగా నిలిచారు. ఈ మేరకు సంస్థ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శేషారావుకు పెదకూరపాడు సర్పంచ్ జి.రాజు, సామాజికవేత్తలు, అభ్యుదయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.


పెదకాకానిలో


మంగళగిరిలో

గుంటూరులో 26న కార్మిక, రైతు ర్యాలీ, బహిరంగ సభ

జయప్రదానికి రౌండ్‌టేబుల్ సమావేశాల్లో అఖిలపక్షం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - పెదకాకాని : కార్మిక, కర్షక సమస్యలు పరిష్కారం చేయాలని 26న గుంటూరులో నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్‌చేశారు. గురవారం పెదకాకానిలోని సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ రైతు కూలీ సంఘం నాయకులు దానబోయిన భాస్కరరావు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందని, నేషనల్ మోనిట్రైజేషన్ విధానం మరియు దశాబ్దాల పోరాట ప్రతింగా సాధించు కున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడులను తీసు కొచ్చారన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తాం అని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం వెలుగు నేషనల్ హెల్త్ మిషన్ సమగ్ర శిక్ష ఉపాధి హామీ స్కీం వర్కర్ల ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువకు మరో 50శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణ సౌకర్యం అమలు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని 26వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుండి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఎఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య సిఐటియు మండల కార్యదర్శి దీవి నరసింహారావు కే సత్యనారాయణ వి శివయ్య బి బాబురావు బి సాంబయ్య ఏసుపాదం పాల్గొ న్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26 న గుంటూరులో జరిగే మహా ప్రదర్శన, ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు చిన్ని సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఏఐ ఎఫ్టీయూ నాయకులు కే కోటేశ్వరరావు మాట్లాడుతూ పిలుపు నిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో రైతు సంఘం, సిఐటియు, ఏఐటీయూసీ, ఏఐఎఫ్టియు న్యూ ఆధ్వ ర్యంలో ధర్నా, ప్రదర్శన జయప్రదం చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతు రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 576 ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 550 జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చినట్లుగా తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు టి ప్రసాద్ రెడ్డి, వల్లూరి భారతి, ఎం పకీరియా, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వై కమలాకర్, ఎం బాలాజీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు టి శ్రీనివాసరావు, కే వెంకటేశ్వరరావు, డి రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధా నాలను నిరసిస్తూ, దేశవ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరులో ఈనెల 26న జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవసాయన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, అదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే విధానాలు అనుసరిస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 26న ఉదయం 10:30 గంటలకు గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ్‌కుమార్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత కార్మిక, రైతు సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 26న రాజ్యాంగ పరిరక్షణ దినం పేరుతో గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. గురువారం పాతగుంటూరులోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ విస్తృత సమావేశంలో నేతాజి మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే విధానాలు ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, తదితర రైతు, కార్మిక సమస్యలపై జరిగే ర్యాఃలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టి. రాధా , పి.దీవెనరావు, టి.శ్రీనివాసరావు, పి.విమల్ కుమార్, నాగేశ్వరి, నాహిద, భారతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ నవంబరు 26న గుంటూరు లో జరిగే ర్యాలీ సభను జయప్రదం చేయాలని కోరుతూ తెనాలి ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు తెనాలి డివిజన్ కమిటి కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి అధ్యక్షత వహించారు. రైతు సంఘం నాయకులు ములకా శివశాంబి రెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ప్రస్తుతం చేతి కందిన పంట కారు చౌకగా విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం పోరాడాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు కె బి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదార్లకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదని, కార్మిక వర్గానికి ఎటువంటి హక్కులు లేకుండా పోయిందని అన్నారు. పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయుట లేదని వాపోయారు. ఎఐటియుసి నాయకులు గురు బ్రహ్మం మాట్లాడుతు విద్యుత్ సవరణ చట్టం అమలులోకి రాకుండా చూడాలని కోరారు. సమావేశంలో మాగంటి యాలమందయ్య, ఎం సాంబ శివ రావు, కె రవి కుమార్, ఎన్ రాజ్య లక్ష్మి, ఎం శివ కుమారి, ఎవిఎన్ కుమారి, కళాధరి పాల్గొన్నారు.


గుంటూరులో మీడియాతో మాట్లాడుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు


తెనాలిలో


పాతగుంటూరులో

ఎస్ఆర్ఎంలో జాతీయ స్థాయి పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయస్థాయి పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో ఈ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, ఇన్చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కల్లూరి వినాయక్ లు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. షా బుక్ హౌస్ (హైదరాబాద్) శాంతి బుక్ హౌస్ (చెన్నై) మరియు విజయవాడ ఇస్కాన్ వారి సహకారంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని ప్రదర్శన పర్యవేక్షకులు యూనివర్సిటీ చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ జానకిరామన్ పేర్కొన్నారు. యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతో పాటు అన్ని విషయాల్లో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అకడమిక్, కెరీర్, రీసెర్చ్, లిటరేచర్ సెక్టార్లకు చెందిన పుస్తకాలతో పాటు ఆధ్యాత్మిక, భావాత్మిక, సాంఘిక రచనలతో కూడిన సుమారు 30 వేల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచినట్లు సీనియర్ లైబ్రేరియన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పుస్తకాలను కొనుగోలు చేసే విద్యార్థులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. దేశీయంగా ఉన్న ప్రఖ్యాత బుక్ పబ్లిషర్స్ విడుదల చేసిన పేరున్న పుస్తకాలను అందుబాటులో ఉంచామని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ముద్రితమైన పలు గ్రంథాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ షా బుక్ హౌస్ డైరెక్టర్ రాసిస్ షా, ఇస్కాన్ ప్రతినిధులు, యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న వీసీ మనోజ్, రిజిస్ట్రార్ తదితరులు


పుస్తక ప్రదర్శను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు రాజధానిలో రేపు 'ఈ - లాటరీ'

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించేందుకు 23వ తేదీన 'ఈ - లాటరీ' నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు గురువారం విజయవాడలోని సి ఆర్ డి ఎ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం సిఆర్‌డి ఎ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను అప్పగించిన రైతులకు శనివారం విజయవాడ లెనిన్ సెంటరులోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ నిర్వహించడం జరుగుతుందని, అమరావతిలో తొమ్మిది గ్రామాలలోని రైతులకు ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లు కేటాయియించడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఈ-లాటరీ వివరాలు. కృష్ణాయపాలెం, నవులూరు (1మరియు2), బోరుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు (1మరియు2) గ్రామాలకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, వెలగపూడి, మందడం (1మరియు2), నిడమర్రు (1మరియు2), అనంతవరం గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని అధికారులు తెలిపారు.



25వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో దీక్ష శిబిరంలో సభ జరిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు జొన్న శివ శంకర్ రావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందుకు ప్రభుత్వం వైపు నుండి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీలు గుర్తు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు సంయుక్త కిసాన్ మోర్చా తరపున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. మీ పోరాటాలకు అండదండలు ఇస్తామని హామీ ఇచ్చారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐ ఎఫ్ టి యు నాయకులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, యూని యన్ నాయకులు కొరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మికుల సమస్య న్యాయబద్ధమైందని తెలిపారు. సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. కార్యక్ర మంలో ఎం ఆశీర్వాదం, అంకయ్య, ఎస్ కే భాష, సుబ్బారావు, రమాదేవి, నవనీతం, శారద, చారమ్మ, సామ్రాజ్యం, దుర్గారావు, సాంబయ్య, యెహోషువ, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

29న లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు



స్వామి నక్షత్రం సందర్భ ంగా నల్లపాడులోని స్వయ ంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో 29న ఉదయం 7.30 గంలకు పంచామృత సహిత ఫలరస స్నపన, విశేషార్చనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అర్చనల అనంతరం హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని, మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, 5 గంటలకు కోటి దీపోత్సవం, 7 గంటలకు కార్తీక వన సమారాధన ఉంటాయని వివరించారు.

పాఠశాలల పనివేళల మార్పు వద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాఠశాలల పని వేళల పెంపు నిర్ణయాన్ని పున్న సమీక్షించాలని ఎస్‌టియు పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్వి రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్ డిమాండ్ చేశారు. నరసరావుపేటలో గురువారం జరిగిన ఎస్టీయు సమావేశానికి వచ్చిన వారు మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా ఒక జిల్లా అని చెప్పినా రాష్ట్రం మొత్తం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులను విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పని వేళల మార్పు విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. రవాణా సౌకర్యాలు, స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు ఉపాధ్యాయ సంఘాల సలహా, సూచనలను పరిగణలోకి తీసుకొని తక్షణమే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. బోధన సమయాలకు ఆటంకం కలిగేలా ఉన్న యాప్‌ల భారాన్ని తొలగించాలని, శిక్షణా తరగతులను జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఉండేలా చూడాలని కోరారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వర్షాల నేపథ్యంలో దిగుబడి తగ్గడంతోపాలు ధరలు పతనమై నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు టి.బాబురావు, నియోజకవర్గ అధ్యక్షులు సిహెచ్.బాబురావు కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల వల్ల రైతులు అవస్థ పడుతున్నారని, తేమ శాతం పేరుతో కొనుగోలుకు తిరస్కరిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ రహదారులపైనా యూజర్ ఛార్జీల విధానాన్ని ప్రవేశపెడతామంటూ సిఎం ప్రకటించడం సరికాదన్నారు. రహదారుల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయం ప్రజలపై పెను భారానికి దారితీస్తుందన్నారు.



త్రికోటేశ్వరుణ్ణి దర్శించిన విధుశేఖరభారతి మహాస్వామి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ త్రికోటేశ్వరుణ్ణి శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహాస్వామి గురువారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. త్వరలో కోటప్పకొండలో కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు అప్పయ్య తెలిపారు.

ఎంఆర్‌పి ధరలకే మద్యం అమ్మాలి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ఎంఆర్‌పి ధరలకు మించి మద్యాన్ని విక్రయిస్తే కేసుల నమోదుతోపాటు ఆయా షాపుల లైసెన్సును రద్దు చేస్తామని ప్రొహిబిషన్ - ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ హెచ్చరించారు. ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకులతో సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మీతో కలిసి గురువారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం విక్రయించొద్దన్నారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పేపర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు కోసం వచ్చేనెల 8వ నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ (జాతీయ ప్రతిభ ఉపకార వేతనం) టాలెంట్ టెస్ట్‌కు ముందస్తుగా రూపొందించిన మోడల్ గ్రాండ్ టెస్ట్ పేపర్ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్-2024 మోడల్ గ్రాండ్‌టెస్ట్ పేపర్‌ను పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని తన కార్యాలయంలో డిఇఒ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఐదేళ్లపాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కారల్‌షిప్ అందుతుందని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులు ఈ మోడల్ టెస్ట్ పేపర్‌ను నిశితంగా పరిశీలించి ప్రధాన పరీక్షలో విజేతలగా నిలవాలని ఆకాక్షించారు. మోడల్ పేపర్ తయారుచేసిన ఉపాధ్యాయులు ఎం.శివశంకర్, ఎస్.రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, జిసిడిఒ దొండేటి రేవతి పాల్గొన్నారు.

'వాలంటీర్లను నమ్మించి నట్టేట ముంచిన కూటమి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా పరిపాలన, ప్రభుత్వ సేవలను గడపగడపకు వికేంద్రీకరించి విస్తరింపజేయడం ద్వారా దేశ వ్యాప్తంగా ఆదర్శప్రాయమైన వ్యవస్థను కూటమి ప్రభుత్వం కొనసాగించాల్సి పోయి, రద్దు దురుద్దేశపూరితమని సామాజిక కార్యకర్త ఈదర గోపీచంద్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బుడమేరు వరద బాధితుల సేవలకు చివరి నిమిషంలో వాలంటీర్లను ఉపయోగించుకున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచిందా? అని ప్రశ్నించారు. వాలంటీర్లను కొనసాగించడమే కాకుండా వారికి రూ.10 వేలు ఇస్తానని గత ఉగాది రోజున చంద్రబాబు హామీనిచ్చారని, ఎన్నికల్లో చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు 2.50 లక్షల మంది న్యాయబద్ధమైన ఆశలపై నీళ్లు చల్లారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, పోర్టులు తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం, పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను రద్దు చేయడం వంటి అనేక వరుస తప్పులు చేస్తూ ఇప్పుడు ఈ వలంటీర్ల వ్యవస్థను కూడా నాశనం చేయడం ఈ ప్రభుత్వ వినాశనానికే దారితీస్తుందని పేర్కొన్నారు. వాలంటీర్లు నిరుత్సాహపడకుండా ఎన్నికల నాటి హామీ అమలు కోసం పోరాడాలని సూచించారు.

ఊర్లో లేని వారి జాబ్ కార్డులు తొలగించాలి : ఎపిఒ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్



మాట్లాడుతున్న ఉపాధి హామీ ఏపీఓ నాగ శ్రీనివాస్

నిబంధనలకు లోబడి ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఏపీఓ నాగశ్రీనివాస్ అన్నారు. మాచర్లలో ఉపాధిహామీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ మండలంలో 25 పశువుల షెడ్‌లు మంజూరయ్యాయని, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని, ఇప్పటికీ పనులు మొదలు కాని వాటిని రద్దు చేసి కొత్తవారికి ఇస్తామని చెప్పారు. 100 రోజుల పని పూర్తి చేసుకున్న జాబ్‌కార్డుల్లోని కుటుంబాల్లో 18-35 ఏళ్ల వారిని గుర్తించాలన్నారు. జాబుజార్డులు సర్వే చేసి చనిపోయిన వారి పేర్లు తొలగించాలని చెప్పారు. ఊర్లో లేని వారికి జాబు కార్డులు తొలగించాలని, కొత్త జాబు కార్డులు కావాల్సిన వారిని గుర్తించాలని సూచించారు. గురజాల క్లస్టర్ ఏపీడీ మల్లికార్జునరావు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జెఇ గోపి, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయలకు మాక్స్ విజన్ కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నరసరావుపేట రోటరీ క్లబ్, డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ సహకారంతో నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. రొటేరియన్ కపిలవాయి రమేష్ చంద్రదత్తు, కొత్తూరి శ్రీనివాసరావు, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ మేళ్లచెరువు సుమిత్ర కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షులు కపిలవాయి రాజేంద్రప్రసాద్, సెక్రెటరీ సాతులూరి శివకుమార్, రోటరీ క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ ఎస్.కె. జిలాని మాలిక్, రోటరీ డైరెక్టర్ పోటు అచ్యుత్, మున్సిపల్ బాలికొన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం. బి.నిర్మల భాయి, తిలక్ స్కూల్ హెచ్‌ఎం కెఎస్ నరసింహారావు, ప్రసాదు పాల్గొన్నారు.



విమలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వాగ్దేవి విద్యార్థినికి టిసిఎస్‌లో ఉద్యోగం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న పుసులూరి విమల బహుళజాతి ఐటి రంగంలో దిగ్గజ కంపెనీ టిసిఎస్‌లో ఉద్యోగం సాధించినట్లు కళాశాల సెక్రటరీ- కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ మొదటి ఏడాది నుండి నిర్వహిస్తున్న వృత్తి విద్యా పరమైన కోర్సుల వల్ల తమ విద్యార్థులు బహుళజాతి కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలకు, ఆయా సందర్భాల్లో సంస్కృతి, సంప్రదాయాలకనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విమలను ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, ఓగూరు నాగేశ్వరరావు, పి.కృష్ణారావు, సుధా సురేష్‌బాబు, ఇ.కబుష్ణకిషోర్, అధ్యాపకులు అభినందించారు.



వర్షితను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వర్సిటీ మహిళా కబడ్డీ జట్టుకు 'విక్టరీ' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలకు విక్టరీ డిగ్రీ కళాశాల విద్యార్థిని గోరంట్ల వర్షిత ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఈనెల 12,13 తేదీలలో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీల్లో వర్షిత ప్రతిభ చాటినట్లు చెప్పారు. ఈనెల 29 నుండి డిసెంబరు 2వ తేదీ వరకు తమిళనాడు అలగప్ప యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు వర్షిత ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వర్షితను కళాశాల సెక్రెటరి - కరెస్పాండెంట్ బద్దుల సుబ్బారెడ్డి, డెరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.కృష్ణంరాజు, ఎం.మల్లికార్జునరెడ్డి అభినందించారు. ఉత్తమ ప్రతిభ చూపి వర్సిటీ జట్టుకు విజయం చేకూర్చాలని ఆకాంక్షించారు.

రూ.11 లక్షల సిఎం సహాయనిధి మంజూరు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పాల్వాయికి చెందిన షేక్ సైదాజాన్‌కు ఆపరేషన్ నిమిత్తం రూ.11 లక్షలు సిఎం సహాయనిధి మంజూరైనట్లు సర్పంచి మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి గురువారం తెలిపారు. షేక్ సైదాజాన్ తల సేమియాతో బాధపడడంతో పాటు ఎముకల మార్పిడి చేయాల్సి ఉండడంతో హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటలో వచ్చేనెల 20వ తేదీ లోపు ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సహాయం మంజూరుపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి బాధితుడు, సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు 71 మందికి రూ.1.11 కోట్లు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు.

ఎస్సీవర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి : మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గుంటూరు లోని ఓహోటల్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నియమించటంపై హర్షం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలోని కమిషన్‌కు తమకు జరిగిన అన్యాయాన్ని ఆధారాలతో సహా తెలియేసి సంపూర్ణంగా సహకరి స్తామన్నారు. రెండు నెలల్లోపు కమిషన్ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరినట్లు తెలిసిందని, కానీ నిరుద్యోగుల్ని దృష్టిలో పెట్టుకొని నెల రోజుల్లోనే నివేదిక వచ్చేలా ప్రభుత్వం, కమిషన్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హర్యానా ప్రభుత్వం నియమించిన కమిషన్ 10 రోజుల్లో నివేదిక ఇచ్చిందని, ఆ వెంటనే అసెంబ్లీలో కూడా తీర్మానం చేశారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని నెల రోజుల్లో నివేదిక ఇస్తే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలకు న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. మాదిగ సామాజిక తరగతికి చెందిన నిరుద్యోగులే కాకుండా ఇతరులు కూడా నోటిఫికేషన్ల ఎదురు చూస్తున్నారన్నారు. కావున వారందర్నీ దృష్టిలో పెట్టుకొని వర్గీకరణను త్వరిత గతిన పూర్తి చేయాలని, నివేదిక త్వరగా వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జనవరిలోపు వర్గీకరణ అమలు జరిగేలా చూడాలన్నారు. చంద్రబాబునాయుడు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మాదిగ, మాల ప్రజాప్రతినిధులు అందరూ వర్గీకరణకు ముందుకు తీసుకెళ్లటానికి అంగీకారం తెలిపినట్లు తెలిసిందన్నారు. ఉమ్మడి అంగీకారంతో ప్రభుత్వం ముందుకు పోవటం అభినందనీయమన్నారు.అయితే ఎ, బి, సి, డి కేటగిరీల్లో 'డి' రద్దు చేయటాన్ని స్వాగతిస్తామని, ' డి' కేటగిరీలోని వారిని ' సి' కేటగిరిలో కలిపే ప్రతిపాదనలను మాత్రం తాము అంగీకరించబోమని, దీని వల్ల మాదిగలు నష్టపోతారని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సురేష్ మాదిగ, కె.సత్యం మాదిగ, సిహెచ్.సత్యం మాదిగ, వి.సుధీర్ మాదిగ, యం.హృదయరాజు మాదిగ తదతరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యలపై డ్రైవ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పురపాలికలో పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక గురువారం 16వ వార్డులో పర్యటించారు. అక్కడ నెలకొన్న మురుగు సమస్యలను పరిష్కారించారు. అనంతరం నమస్తే స్కీం స్వచ్చంద్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో తెనాలి మున్సిపల్ కార్యాలయంలో స్కావెంజెర్స్ ఎనిమది మందికి తొమ్మిది రకాల పిపిఇ కిట్లను మున్సిపల్ చైర్పర్సన్ రాధిక రమేష్, కమిషనర్ శేషన్న పిపిఈ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, అసిస్టెంట్ ఇంజనీర్ సూరి బాబు, ఎంహెచ్ఓ హెలెన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి - చేబ్రోలు : పొన్నూరు పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం వాలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలంటీర్స్ అసోసియేషన్ (ఎవైవైఎఫ్) అనుబంధం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వాలంటీర్స్ నల్ల రిబ్బన్లు ధరించి , కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె వెంకట భవాని ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య మాట్లాడుతు కూటమి ప్రభుత్వం వాలంటీర్లను, యదావిధిగా కొనసాగించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు వేతనంతో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్ర మంలో నాయకులు షేక్ జానీ, గోపి, బాజీ , మహేశ్వరి ఆరే టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ప్రజాశక్తి-దుగ్గిరాల : ప్రపంచ మత్సకారుల దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలోని క్రొత్త లాకుల వద్ద ఘనంగా నిర్వహించారు. మత్స్యకారుల సంఘం గ్రామ కార్యదర్శి నడి కుదుటి శ్రీనివాసరావు మత్స్యకారుల సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేట నిషేధ కాలంలో రూ.20000 ఇస్తామని చేసిన వాగ్దానం అమలు చేయాలని డిమండ్ చేశారు. మత్స్యకారులకు బోట్లు వలలు సాంప్రదాయ భృతి, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ శ్రీనివాస రావు ఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దురాక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

దశాబ్దాలుగా చిలువూరు గ్రామం మాదిగ పల్లె స్మశాన వాటిక దురాక్రమణాలను తొలగించాలని స్మశాన వాటికకు నిర్దిష్ట రహదారి ఏర్పాటుకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో హైకోర్టు అత్యవసర నోటీసులను, ఆదేశాల నోటీసులను కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడుతూ చిలువూరు మాదిగ పల్లెకు సంబంధించిన స్మశాన వాటిక నిర్దిష్ట రహదారి లేకపోవడం వల్ల వ్యక్తి మరణానంతరం మృతదేహాన్ని సదరు స్మశాన వాటికకు తీసుకు పోవాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అభ్యస ఫౌండేషన్ చైర్మన్ చిలువూరు ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్ మాదిగ, పులి ప్రభుదాసు, కొమ్ము ఆనంద్, కొమ్ము వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పిఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో

మంగళగిరిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో పీఈపీఎల్ అధినేత పితాళ్ళ మస్తాన్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పీఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం పలుచోట్ల వివిధ సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. ఆయా సేవా కార్యక్రమాలలో అధినేత పితాళ్ళ మస్తాన్ రావు హాజరై జన్మదినోత్సవ కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆఫీసులో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మస్తాన్ రావు ప్రారంభించారు. సీతారామాంజనేయ పేట, కుప్పురావు కాలనీ, రత్నాల చెరువు, టిట్కో గహ సముదాయాలు వద్ద ఒక్కోచోట 30 మంది పేద కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాలలో మస్తాన్ రావు చేతుల మీదుగా పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంఆర్



యూత్ ప్రతినిధులు దామర్ల తారక్నాథ్, మల్లూరి మహేష్, ప్రగడ శ్రీనివాస్, గోలి ముని, వివిధ రంగాల ప్రముఖులు, నాయకులు పితాళ్ళ శ్రీనివాసరావు, కటారి శ్రీనివాసరావు, బట్టు నాగ సత్యనారాయణ, నల్లమోలు దుర్గా శంకర్, బట్టు చిదానంద శాస్త్రి, జంజనం వెంకట సుబ్బారావు, తోట నాగేశ్వరరావు, కాదా నాగ సుధాకర్, సుంకర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాత మంగళగిరి శ్రీకష్ణ చైతన్య వద్ధుల ఆశ్రమంలో జొన్నాదుల శివశంకరరావు ఆధ్వర్యంలో వద్ధులకు అన్నదానం నిర్వహించారు.

డాక్టర్ యశోధరకు అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి ఏడాది అందిస్తున్న "షారోన్ అంతర్జా తీయ అవార్డుకు పట్టణానికి చెందిన డాక్టర్ పువ్వాడ యశోధరను జ్యూరీ ఎంపికచేసినట్లు సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి గురువారం తెనాలిలో తెలిపారు. కెనాడ దేశా నికి చెందిన షారోన్ వృత్తిరీత్యా వైద్యురాలు కావటంతో ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వైద్యులకే ఈ ప్రతిష్టాత్మక ఆవార్డును సంస్థ ద్వారా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ శారదకు ఈ అవార్డును ప్రధానం చేసినట్లు చెప్పారు. మార్చి 28 న ఈ ప్రతిష్టాత్మక షారోన్ అంతర్జాతీయ అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలియజేసారు. అవార్డు గ్రహీత తండ్రి పువ్వాడ సోమశేఖర్ తెనాలిలో పిల్లల వైద్యనిపుణులు కాగా భర్త డాక్టర్ కృష్ణ సందీప్ తెనాలిలోని మైత్రి హాస్పిటల్ వ్యవస్థాపకుల్లో ఒకరన్నారు. అవార్డు ప్రధానోత్సవంలో పట్టణ ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలియచేశారు.



సరుకులు అంద జేస్తున్న స్వాతి

విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - మంగళగి

మండల కేంద్రమైన తాడి కొండ దళిత వాడ లోని, కోలిక పూడి ప్రసాద్, సామ్రాజ్యం దంపతులు తమ ముగ్గురు సంతా నాన్ని అనారోగ్య కారణాలతో కోల్పోయారు. ఈ దంపతులు అనారోగ్యానికి గురై జీవనోపాధికి ఇబ్బంది పడు తున్నారు. ఇది తెలుసుకున్న మంగళగిరి విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్ గురువారం వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. వీటిని ఏ రాజా బాబు, నాగజ్యోతి, హేమంత్ సాయం చేసినట్లుగా స్వాతి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొడ్డేటీ రమేష్, ట్రస్ట్ వాలంటీర్ మహేష్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు తక్షణం చెల్లించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల : బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని దుగ్గిరాల 104 సిబ్బంది టి ఇందు, కే సుధాకర్ గురువారం స్థానిక సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్, గ్రామ కార్యదర్శి వివేకానంద కు అర్జీ నిచ్చారు. రెండు నెలల నుండి జీతాలు రావటం లేదని ప్రభుత్వ జీవో నెంబర్ సెవెన్ ప్రకారం వేతనాలు చెల్లించాలని అర్జీలో పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న ఇంక్రిమెంట్లు ఎరియర్లు వెంటనే చెల్లించాలని ఈఎస్ఐ పిఎఫ్ యాజమాన్యం వాటా యాజమాన్యమే చెల్లించాలనీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని అర్జీలో పేర్కొన్నారు.



విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ లో ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినీ, విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా హైస్కూల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమాన్ని ఆర్‌బిఎస్‌కే స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ జయ రామకృష్ణ, ప్రోగ్రాం అసిస్టెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసన్న డాక్టర్ పవన్ ఐటీ మేనేజర్ శివ శంకర్ పరిశీలించారు. యూ పి హెచ్ సి వైద్యాధికారిని డాక్టర్ అనూష నేతత్వంలో వైద్య పరీక్షల నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహించి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తేలితే గుంటూరు జిజిహెచ్ లోని డైక్ సెంటర్ కు పంపుతామని డాక్టర్ అనూష పేర్కొన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు హెల్త్ కార్డును అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ హెల్త్ కార్డులో సదరు విద్యార్థికి సంబంధించి హెల్త్ రికార్డ్స్ నమోదయి ఉంటాయని అన్నారు. ప్రతి విద్యార్థికి అబా ఐడిని క్రియేట్ చేసి ఇస్తామని, ప్రతి గురు, శని వారాల్లో జరుగుతుందని తెలిపారు. ప్రతి గురువారం, మున్సిపల్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చట్టాలపై వర్సిటీలో రేపు అవగాహన

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జిల్లా న్యాయ సేవాసాధికారిక సంస్థలు సంయుక్తంగా నవంబర్ 23వ తేదీన పలు న్యాయ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పీజీ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాధిపతి ప్రొఫెసర్ లక్కరాజు జయశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వేణుగోపాల్ రెడ్డి సెమినార్ హాల్ లో శనివారం ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా జడ్జిలతో కలిసి న్యాయవిభాగపు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పలు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర రావు, రెక్టర్ ప్రొఫెసర్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి .సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్ లు పాల్గొంటారని తెలిపారు. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తో పాటుగా పలువురు జడ్జీలు ఆయా చట్టాలపై ఉపన్యాసాలను అందిస్తారని, గుంటూరు జిల్లా ఫ్యామిలీ కోర్టు, 12వ అదనపు జిల్లా జడ్జి జి. చక్రపాణి ఎస్ సి, ఎస్టి అట్రాసిటీ చట్టం, రెమిడీస్ ఎగైనెస్ట్ ఫాల్స్ ఎఫ్ఐఆర్, జిల్లా న్యాయ సేవ సాధికారత సంస్థ కార్యదర్శి జడ్జి శ్రీమతి లీలావతి సెక్సువల్ హెరార్స్మెంట్ ఆఫ్ ఉమెన్ యట్ వర్క్ ప్లేస్, ఫోర్త్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. కుమిదిని గృహహింస చట్టంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అనుబంధ కళాశాలల విద్యార్థులతో పాటు వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చని ప్రొఫెసర్ జయ శ్రీ తెలిపారు.

చిల్లపల్లికి కాకినాడ ఎంపి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి



జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిల్లపల్లి శ్రీనివాసరావును గురువారం కాకినాడ ఎంపీ టి ఉదయ్ శ్రీనివాస్ ఏపీ ఎంఎస్ ఐడీసీ ఆటోనగర్ కార్యా లయంలో కలిసి అభినందించారు.

జనగణనలో కులగణనా చేపట్టాలి : కేశన

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయస్థాయిలో నిర్వహించే జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయాల్సిందిగా, రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లకు మెమోరాండాలు సమర్పించాలని గురువారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశంలో ఈనెల 25 సోమవారం ప్రభుత్వ ఫిర్యాదుల దినం(గ్రీవెన్స్ డే) నాడు, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో భారీ ర్యాలీలు జరిపి, జనగణలలో సమగ్ర కుల గణన జరపాలంటూ నినదిస్తూ, కలెక్టర్లకు మహాజర్ పిటిషన్ ఇవ్వాలని పిలుపు ఇచ్చినట్లుగా తెలిపారు. 2011లో ప్రతి పక్షంలో ఉన్న బిజెపి అగ్ర నాయకులు, 2021 లో జరిపే జనగణనతో పాటే, దేశంలోని అన్ని కులాల జనాభాను లెక్కించి, వారి జీవనస్థితిగతుల్ని సేకరించాలని కోరారని, కాని నేడు అధికారంలో ఉండి కుల గణన జరపడం వల్ల జాతీయ సమైక్యత దెబ్బతింటుందంటూ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆనాడు బిజెపి పెద్దలు ఈసారి జరిపే జనగణనతో పాటే కులగణన చేయాలన్నప్పుడు మౌనం వహించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, ఈసారి మాత్రం జన గణనతో పాటే కులగణన జరపాలంటూ, బీసీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందంటున్న దన్నారు. ఇలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరో మాటగా, రెండు జాతీయ పార్టీలు ఓబీసీలను ఓటు బ్యాంకు గానే చూస్తూ, తమ రాజకీయ పబ్బం గడుపు కుంటున్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వ రరావు, రాష్ట్ర కార్యదర్శి శివరాం బాబాజీ, ఆలా శివాజీ, జె వరప్రసాద్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహించనున్నట్లు జెడ్పీ సిఇఒ జ్యోతిబసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ మీటింగ్ హాల్లో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ప్రారంభం అవుతుందని, కేంద్ర సహాయమంత్రి, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్, శాసన మండలి, శాసన సభ్యులు, జెడ్పీటిసిలు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. సమావేశంలో వ్యవసాయం, అనుబంధ శాఖలు, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉపాధి హామీ, గృహ నిర్మాణ సంస్థ తదితర శాఖల అజెండాపై సమీక్ష జరుగుతుందన్నారు.

మహిళా సహకార ఆర్థిక సంస్థ
చైర్‌పర్సన్‌గా గ్రీష్మ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు


మీడియాతో మాట్లాడుతున్న గ్రీష్మ

మహిళలు, పిల్లలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఆంధ్రప్రదేశ్ మహిళ సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ కావలి గ్రీష్మ అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహిళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ మహిళ సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా గ్రీష్మ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి తన కుమార్తె కావలి గ్రీష్మను ఈసందర్భంగా అభినందించారు. అనంతరం చైర్ పర్సన్ గ్రీష్మ మీడియాతో ఈ పదవిలో వున్నంత కాలం ఎటువంటి స్వార్థం లేకుండా మహిళల అభ్యున్నతి కోసం పని చేస్తానన్నారు. ఒక మహిళగా సోషల్ మీడియా పోస్టుల వల్ల ఎంతో ఆవేదన అనుభవించానని , మహిళలపై దాడులు జరుగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ఒక మహిళను హోమ్ మంత్రిగా చేశారన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే ఈ కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సోషల్ మీడియా అంటేనే సోషల్ జస్టిస్ అని , అలాంటి సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. అనంతరం మహిళా ప్రాంగణంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు చేసిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు , మహిళా ప్రాంగణం మేనేజర్ సిహెచ్ రమణశ్రీ పాల్గొన్నారు.

'రాజధానిలో దాక్కుని తిరగాల్సివస్తోంది..'
అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో భూమిలేని పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చే పింఛను నిలిపివేశారని, దీంతో రాజధాని గ్రామాల్లో దాక్కొని తిరగాల్చిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అసెంబ్లీలో అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కౌలు ఇస్తుండగా వ్యవసాయ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న భూమిలేని పేదలకు నెలవారీ ఫించన్ రూ 2,500 లు చెల్లించేలా గతంలో టిడిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సభ దృష్టికి తీసుకువచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాల్లో పారిశుధ్యార్మికులుగా ఉన్న భూమిలేని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారికి అమరావతి ఫెన్షన్ ను నిలిపివేసిందని చెప్పారు. నిలిపివేసిన ఫెన్షన్‌ను తిరిగి ఇవ్వాలని తాను అనేకమార్లు వైసిపి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానన్నారు. తనకు అసెంబ్లీ, రాజధాని గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదని, కార్మికుల పింఛను ఎప్పుడు ఇస్తారని ఎక్కడికక్కడ నిలదీస్తు న్నారని చెప్పారు. రూ 2,500ల నుంచి రూ. 5 వేలకు పెంచిన అమరావతి ఫెన్షన్‌ను పునరుద్ధరించి అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాలకు అందేలా చర్యలు తీసుకోవాలని శ్రావణ్ కుమార్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు విజ్ఞప్తి చేశారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రెటరీ తదితరులు

ఆర్‌విఆర్‌లో ఫార్మాథాన్ జాతీయ స్థాయి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ ఇంజినీరింగ్ కాలేజి, చేబ్రోలు ఫార్మసీ కాలేజి సంయుక్త ఆధ్వర్యంలో ఫార్మాథాన్-2024 జాతీయ స్థాయి ప్రోటోటైప్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. గురువారం కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, రెండు కాలేజిల సిబ్బందితో కలిసి పోస్టర్ ఆవిష్కరించి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఫార్మా, వైద్య రంగాలకు సంబంధించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనకు దేశం నలుమూలల నుండి విద్యార్థులు హాజరవుతారని గోపాలకృష్ణ తెలియజేశారు. ఆర్‌విఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, చిప్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర మాట్లాడుతూ డిసెంబర్ 12న ప్రాధమిక ఎంపికలు, 21న ఫైనల్స్ ఉంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. అలాగే వారిని అంకుర పరిశ్రమల స్థాపన వరకూ ప్రోత్సహించేందుకు, వారి ప్రొడక్ట్‌లు ప్రోటోటైప్ దశకు వెళ్ళేందుకు ఆర్‌విఆర్ ఇంకుబేషన్ సెంటర్ నుండి రూ.10లక్షల వరకూ గ్రాంట్ అందచేస్తామన్నారు. పాల్గొనే వారు https://rvrjcce.ac.in/ rjenest/https://www.chips.ac.in/pages/index.php వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తారకరామ నగర్ రోడ్డు విస్తరణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు



స్థానిక తారకరామ నగర్ మెయిన్ రోడ్డును 60 అడుగులకు విస్తరణకు చర్యలు తీసుకోవాలని, తొలుత డొంక ఫిక్స్ చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ తారకరామ నగర్‌లో ప్రతిపాదిత విస్తరణ రోడ్, నాయి బ్రాహ్మణ కాలని, ఏటి అగ్రహారం, రెడ్డిపాలెం, మంగళదాస్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తారకరామ నగర్ మెయిన్ రోడ్‌ని మాస్టర్ ప్లాన్ మేరకు 60 అడుగులకు విస్తరణచేయాల్సిన అవసరం ఉందని, విస్తరణపై ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, స్థానికులు పలు అర్జీలు ఇచ్చారన్నారు. కావున తొలుత డొంకని ఫిక్స్ చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. నోటీసుల గడువు అనంతరం ఆక్రమణల తొలగింపు చేపట్టి, రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. పర్యటనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిపిఎస్ సత్యనారాయణకు షోకాజు..

నిర్దేశిత గడువులోగా ప్రభుత్వ సేవలు అందించటంలో నిర్లక్ష్యంగా ఉండే ఏ స్థాయి అధికారిపైన అయినా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం గడువు సమయంలోగా ఫైల్ పరిష్కారం చేయకపోవడంపై పట్టణ ప్రణాళిక టిపిఎస్ సత్యనారాయణకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ సేవలను నిర్దేశిత ప్రభుత్వ గడువు మేరకు పరిష్కారం చేయటంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. టిపిఎస్ సత్యనారాయణ డిపిఎంఎస్‌లో ఓ భవనానికి సంబంధించిన ఫైల్ 25 రోజుల పాటు తన లాగిన్ లో ఉంచడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. ప్రతి సర్వీసును గడువుకి ముందే పరిష్కారం చేయాలన్నారు.

మూడు నెలల పింఛను ఒకేసారి పొందొచ్చు

ప్రజాశక్తి-గుంటూరు

సామాజిక పింఛన్లు అందుబాటులో లేక తీసుకోలేని వారు ఇక నుండి మూడు నెలల పింఛన్ ఒకేసారి పొందవచ్చునిడిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. పించన్‌దారుడు ఒక నెలలో పించన్ సొమ్ము తీసుకోలేకపోతే దానిని రెండో నెల పింఛన్ సొమ్ముతో కలిపి తీసుకోవచ్చన్నారు. రెండవ నెలలో కూడా పించన్ తీసుకోకపోతే మూడో నెల సొమ్మును రెండు నెలల బకాయిలతో కలిపి తీసుకోవచ్చున్నారు. పింఛన్‌దారుడు వరుసగా మూడు నెలలు సొమ్ము తీసుకోకపోతే అటువంటి వాళ్లను శాశ్వత వలసగా పరిగణించి, వారి పించన్లను ప్రభుత్వం నిలిపి వేస్తుందన్నారు. శాశ్వత వలసగా నమోదైన పింఛనుదారులు వార్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రెటరీ, మున్సిపల్ కమిషనర్/ఎంపిడిఒలకు పించన్ పునరుద్ధరించమని అభ్యర్థించవచ్చన్నారు. ఆ విధంగా తిరిగి పునరుద్ధరించే పింఛన్ దారులకు ఎలాంటి బకాయి చెల్లింపులు జరగవన్నారు. కావున ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు మారిన నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

ఏలూరి బ్యాంక్ గోరంట్ల బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు


నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి భరత్

గత 25 సంవత్సరాలుగా కోఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో గుంటూరు జిల్లాలో అప్రతిహతంగా కొనసాగుతూ, ఎన్‌పిలు లేకుండా బ్యాంకును నడపటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార మంత్రి టి.జి.భరత్ అన్నారు. గురువారం ఏలూరి బ్యాంక్ గోరంట్ల శాను మంత్రి భరత్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంకును సమర్థవంతగా నడుపు తున్నందుకు ఏలూరి గురవయ్యను అభినందించారు. ది ఏలూరి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ సిల్వర్ జూబ్లీ జరుపుకోవటానికి సద్ధం అవుతున్న తరుణంలో అధునాతన సదుపాయాలతో గోరంట్లలో నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజధానికి చేరువలో అత్యాధునిక సదుపాయాలతో గోరంట్లలో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు చైర్మన్ గురవయ్య మాట్లాడుతూ బ్యాంకు ద్వారా కష్టమర్లకు ఉత్తమ సేవలు అందిస్తున్నామని, కష్టమర్ల నమ్మకం, సిబ్బంది కృషితో బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పురప్రముఖులు, వ్యాపార వేత్తలు, కష్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్ లో దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని నగరంలో ప్రముఖ దంత వైద్యశాల ఆస్ట్రేలియన్ డెంటల్ క్లినిక్ వారిచే కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల సెక్రెటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం తెలియచేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రావిపాటి అచ్యుత్ మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండ ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం దంతాలను శుభ్రం చేసుకోవాలని, దంతాలు ఆరోగ్యంగా ఉంటే మిగతా శరీర భాగాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. విద్యార్థులకు డెంటల్ ఇంప్లాంట్స్ గురించి అవగాహన కలిగించారు.డిగ్రీ కళాశాల ఇంచార్జ్ భానుమురళి ప్రసంగించారు. కార్యక్రమం లో 360 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ జెవి సుధీర్‌కుమార్, కోఆర్డినేటర్ ఆర్.జె.శైలజ, ఇంటర్ క్యాంపస్ ఇంచార్జ్ జి.సురేష్‌కుమార్, డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

చలపతి కాలేజీకి అంతర్జాతీయ ఈసీ కౌన్సిల్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఈ-కామర్స్ కన్సల్టెంట్స్ ద్వారా 'అకాడెమియా బెస్ట్ న్యూకామర్-2024' గోబల్ అవార్డు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలియజేశారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెరుగుపరచటానికి పేరొందిన జాతీయ, అంతర్జాతీయ సంస్థల ద్వారా తమ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇప్పించటం వల్లే ఈ అవార్డు సాధించామని కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు అన్నారు. నాణ్యత, పరిశ్రమలకు సంబంధించిన శిక్షణ అందించంలో అంకిత భావంతో ఈ ప్రశంసను పొందటంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అధ్యాపకులు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ బ్రాంచ్ విద్యార్థులు 15 మంది, ఒక అధ్యాపకుడు ఈ శిక్షణా తరగతుల్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ఈసీ కౌన్సిల్ నుండి సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ సర్టిఫికెట్ అందుకున్నారని సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను కాలేజి యాజమాన్యం, ప్రిన్సిపాల్ అభినందించారు.


ఎథికల్ హ్యాకర్స్ సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులతోప్రిన్సిపాల్ తదితరులు